క్లుప్తంగా

తోడ్పాటు అందించాలి



ఈపూరు: గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని ఇనిమెళ్ల గ్రామంలో శనివారం జరిగిన నూతన సర్పంచ్ మాచర్ల అక్కమ్మ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి ప్రజా సేవ చేసిన వాడే నిజమైన రాజకీయ నాయకుడని అన్నారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు ప్రధాన భూమిక పోషించాలని, అలాంటప్పుడే గ్రామాలు సస్యశ్యామలంగా మారతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోపెల దేవరాజ్, జడ్పీటీసీ తుర్లపాటి చౌడయ్య, శాకమూరి బుచ్చయ్య, గోనుగుంట్ల వెంకటహనుమయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం

నరసరావుపేట: స్థానిక గడియారస్తంభం సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం ఘనంగా నిర్వహించటం జరుగుతుందని శాసనసభ్యుల కార్యాలయం శనివారం తెలియచేసింది. డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పి స్తారన్నారు. అందరూ ఉదయం 10 గంటలకు గుంటూరు రోడ్డులోని శాసనసభ్యులు కార్యాలయం వద్దకు చేరుకోవాలని కోరారు.

ఉచిత ఆయుష్ వైద్యశిబిరం

వినుకొండ(నూజెండ్ల) : ప్రతిదినం ప్రతిఇంటా ఆయుర్వేదం అనే కార్యక్రమంలో భాగంగా నూజెండ్ల మండలంలోని ములకలూరు గ్రామంలో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సమతుల్యమైన ఆహారం తీసుకోవాలని, నడక, వ్యాయామం, యోగా, ధ్యానం వంటివి నిత్యం చేస్తూ ఉండాలన్నారు. తదితర వ్యాధులు, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. వ్యాధినిరోధక శక్తిని పెంచడానికి ఉచితంగా ఆయుష్ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు సుబ్బారావు, వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం మహాలక్ష్మి, , ఆశ కార్యకర్త మరియమ్మ, గంగమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు మహాసభలను విజయవంతం చేయండి

శావల్యాపురం: రైతులు కార్మికుల సమస్యలపై ఈనెల 27,28 తేదీలలో విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం మండల కార్యదర్శి కెవిఆర్ మోహన్‌చందు పిలుపు నిచ్చారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులతో రచ్చబండ సమావేశాలు నిర్వహించి కరపత్రాల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో భువనగిరి వెంకటేశ్వర్లు, ముంద్రు వెంకట్రావు, గణపర్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

చిలకలూరిపేట: రోడ్డు ప్రమాదంలో కారు పంట పొలాల్లోకి దూసుకెళ్లిన సంఘటన శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. నరసరావుపేట వైపు నుంచి వస్తున్న కారు మండలంలోని కావూరు గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగి పోయింది. ఈ సంఘటనలో విద్యుత్ వైర్లు తెగి కారుపై పడక పోవడపోవడంతో ప్రాణాపాయం తప్పింది. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. కారులోని వారికి ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

లింగ వివక్షపై అవగాహన

శావల్యాపురం: మహిళలు అన్నీ రంగాల్లో రాణించాలని ఏపీయం జి.వాసుబాబు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ గ్రామీణ జీవనోపాదుల మిషన్ కార్యక్రమంలో భాగంగా లింగ వివక్షతకు స్వస్తి పలుకుదాంపై అవగాహన సదస్సు మండల స్థాయిలో నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సమాజంలో ఆడ,మగ వివక్షత లేకుండా విద్య, సామాజికంగా అన్నీ రంగాల్లో రాణించేలా చూడాలన్నారు. అనంతరం జండర్ ప్రతిజ్ఞతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు గంజనబోయిన నారాయణమ్మ సీసీలు బేబిరాణి, రమాదేవి, మహిళ సభ్యులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

శావల్యాపురం: ఐటీసీ బంగారు భవిష్యత్-సెర్ఫ్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్లాప్ మిత్రలకు ఆరోగ్య బీమాపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీసీ సెర్ఫ్ సంస్థ కొర్డినేటరు సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ క్లాప్ మిత్రలు ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను బీమాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్‌డి పి.సుగుణ,మండల కోఆర్డినేటరు ప్రదీప్ పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకి మాత్రమే ఉంది

- జగనన్న సంక్షేమ పాలనకు ఓటేయాలి
- మళ్లీ ముఖ్యమంత్రిగా ఆయనే పగ్గాలు చేపట్టాలి
- వాడవాడలా వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు



అగ్నిగుండాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, గ్రామప్రజలు

ఈపూరు: సంక్షేమ పాలన అందించే జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలి, సంక్షేమ పాలన అందించే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలి, రాష్ట్రంలో ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకి మాత్రమే ఉందని వివరించారు పలువురు వైఎస్సార్ సీపీ నేతలు. మండలంలోని అగ్నిగుండాల గ్రామ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా జగనే ఎందుకు కావాలంటే (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. తొలుత సంక్షేమ పథకాల వివరాలు తెలియజేసే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అమలు చేసిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధిని, ఈ ప్రభుత్వంలో జరిగిన మెరుగైన అభివృద్ధిని చూసి ప్రజలు నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కోపెల దేవరాజ్, జెడ్పీటీసీ చౌడయ్య, శాకమూరి బుచ్చయ్య, వైఎస్ ఎంపీపీలు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, ఈపూరు సొసైటీ చైర్మన్ బొల్లా రాధాకృష్ణ, ఊడిజర్ల, అగ్నిగుండాల సర్పంచ్‌లు అంకిరెడ్డి, వెంకిరెడ్డి, ఎంపీటీసీ ప్రతాప్, ఉపసర్పంచ్‌లు ఆదిరెడ్డి, కొండమ్మ, పార్టీ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు పిచ్చయ్య, యూత్ అధ్యక్షులు కుమ్మతె శ్రీను, మాజీ సర్పంచ్‌లు పుట్టా అంజయ్య, వంగల సైదులు, సచివాలయ కన్వీనర్లు లక్ష్మడు నాయక్, గృహసారధులు, వలంటీర్స్, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలవాలి

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- యల్లమందలో చర్చిశ్లాబ్ నిర్మాణానికి పూజలు



సెమిక్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: పేదల బతుకుల్లో వచ్చిన మార్పును గమనించి రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని యల్లమంద గ్రామంలోని ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న చర్చి శ్లాబ్ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. సెమిక్రిస్మస్‌లో భాగంగా కేక్‌ను కట్‌చేసారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ పేదలకు ఆర్థిక చేయూతను అందించేందుకు సీఎం జగన్ సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. పేదలకు అందుబాటులో లేని విద్య, వైద్యాన్ని వారికి అందిస్తూ పేదప్రజల మనస్సుల్లో సీఎం జగన్ చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. యల్లమంద గ్రామంలోని కాలనీల్లో రోడ్లు, డ్రైయిన్‌లు పూర్తిస్థాయిలో ఏర్పాటుచేసినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత కాలనీలో వచ్చిన మార్పును ప్రజలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తన్నీరు శ్రీనివాసరావు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, చల్లా సుబ్బారావు, నాగేశ్వరరావు, శిఖా భద్రి, లక్కపోగు పేరయ్య, గంగుల సుబ్బారావు, నారాయణ, జాగర్లమూడి వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మాయి-అబ్బాయి ఇద్దరూ సమానమే

- ఎంపీపీ ఝాన్సీ
- యడ్లపాడులో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేక ర్యాలీ



జెండాఊపీ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీపీ పిడతల ఝాన్సీ

యడ్లపాడు: సంతానంలో అమ్మాయైనా..అబ్బాయైనా సమానమనే భావన కుటుంబ సభ్యుల నుంచి వచ్చినపుడే జెండర్ ఆధారిత హింస రూపుమాపుతుందని ఎంపీపీ పిడతల ఝాన్సీ చెప్పారు. మండల కేంద్రమైన యడ్లపాడులో మండల సమాఖ్య ఆధ్వర్యంలో లింగవివక్షతపై చేపట్టిన అవగాహన ర్యాలీని ఆమె జెండాఊపీ ప్రారంభించారు. గ్రామ ప్రధాన వీధుల్లో ప్రదర్శన అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సమైక్య అధ్యక్షులు ఆర్ సెల్వీ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మార్పు అనేది కుటుంబం నుంచి మొదలై సమాజానికి ప్రభావితం చేయాలన్నారు. అప్పుడు లింగవివక్షత పూర్తిగా రూపుమాపుతుందన్నారు. ఆలనా పాలనతో పాటు ఇద్దరికీ సమాన విద్యను అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. లింగ ఆధారిత హింస నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం బాలిక నుంచి మహిళల వరకు అనేక విద్యా, ఆరోగ్య, రక్షణ పథకాలను రూపొందించి అమలు చేస్తుందన్నారు. దిశవంటి రక్షణ చట్టాలను సైతం కట్టుదిట్టంగా అమలు చేస్తుందన్నారు. తమ కుటుంబం కూడా విద్య ద్వారానే పేదరికం నుంచి పైకి వచ్చిందని స్ఫూర్తిదాయక సందేశం అందించారు. వైఎస్సార్‌క్రాంతిపథం ఏపీఎం ఎ జగ్జీవన్ మాట్లాడుతూ జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా డిశంబర్ 23 వరకు ఆదివారం మినహా నిత్యం అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సమైఖ్య కార్యదర్శి ఎ లక్ష్మి, ఏవో సాయిశ్రీనివాస్, వీవోఏలు, సీసీలు హేమలత, నాగేశ్వరరావు, రాములమ్మ, పేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మధురై క్లీనర్.. యడ్లపాడులో దుర్మరణం

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ
- తెగిపడిన శరీర భాగాలు



ఘటనాస్థలిలో రక్తపు మడుగులో పడిఉన్న క్లీనర్ కన్నన్ మృతదేహం

యడ్లపాడు: హైవేపై నిలిపిన లారీని వెనుక నుంచి మరోలారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రంలోని మధురైకు చెందిన క్లీనర్ మృతి చెందిన సంఘటన యడ్లపాడు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నుంచి కడప జిల్లాకు సబ్బుల లోడుతో వెళ్తున్న లారీ యడ్లపాడులోని ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్ వద్ద హైవేపై నిలుపుదల చేశారు. కాలకృత్యాలు తీర్చుకుని తిరిగి వెళ్లేందుకు వాహనం ఎక్కారు. అంతలోనే అదేమార్గంలో ఉప్పుడు బియ్యం లోడుతో వస్తున్న 14 టైర్ల లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు దెబ్బతిన్నాయి. బియ్యంలోడు లారీలోని మధురైకు చెందిన క్లీనర్ కన్నన్(45)కి ఎడమచేయి భుజం నుండి పూర్తిగా విడిపోయింది. తలకు తీవ్రం గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్ఐ పి.సురేష్ సంఘటనా స్థలికి సిబ్బందితో చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మనస్పర్థలతో భర్త ఆత్మహత్య



మోటమర్రి శ్రీను మృతదేహం

నాదెండ్ల: భార్యాభర్తల మధ్య మనస్పర్థల నేపథ్యంలో భర్త మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై జె. బలరామ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మచిలీపట్నంకు చెందిన యువకుడు మోటమర్రి శ్రీను (36) పద్నాలుగేళ్ల క్రితం బాపట్ల జిల్లా వేటపాలెంకు చెందిన మేరితో వివాహమైంది. దంపతులు ఇరువురూ గణపవరం శివస్వాతి స్పిన్నింగ్ మిల్లులో పని చేస్తూ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. శ్రీను తన భార్యకు తెలియకుండా కంపెనీలో పనిచేసే ఇరువురు కార్మికుల వద్ద రూ.15 వేలు అప్పుగా తీసుకున్నాడు. తిరిగి చెల్లించకపోవటంతో విషయాన్ని భార్య మేరికి చెప్పారు. తనకు తెలియకుండా తెచ్చిన నగదు ఏం చేశావంటూ భార్య భర్తల మధ్య వివాదం తలెత్తింది. దీంతో శుక్రవారం మధ్యాహ్నం శ్రీను ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వీరికి ఒక కుమార్తె ఉంది. యాజమాన్యం పోలీసులకు సమాచారమివ్వటంతో మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేసి బంధువులకు మృతదేహం అప్పగించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్యాంగం తల్లి వంటిది

నరసరావుపేట ఈస్ట్: దేశప్రజలకు రాజ్యాంగం తల్లి వంటిదని క్లౌడ్ అండ్ డేటా సైన్స్ ఇంజినీర్ ఎస్.యశస్వీ తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం రాజ్యాంగ దినోత్సవ సదస్సును నిర్వహించారు. సదస్సుకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాకాని సుధాకర్ అధ్యక్షత వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన యశస్వీ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాజ్యాంగాన్ని రూపొందించారని తెలిపారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే కార్పొరేట్ సంస్థల్లో క్లౌవుడ్ కంప్యూటర్ టెక్నాలజీకి ఉన్న ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు టి.సునీల్, విద్యార్థులు పాల్గొన్నారు.

అలక్ష్యం వీడాలి

యడ్లపాడు: జగనన్న గోరుముద్ద పథకం అమలులో ఎలాంటి అలక్ష్యం వహించినా చర్యలు తప్పవని ఎంఈవో -1 నాగరత్నం హెచ్చరించారు. మండలంలోని వంకాయలపాడు పంచాయతీలోని ఉప్పరపాలెం ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పాఠశాలలోనూ విద్యాశాఖ నిర్ధేశించిన మెనూ ప్రకారంగా పిల్లలకు భోజనాన్ని ఏజేన్సీలు తయారు చేయాలన్నారు. అలాగే విద్యార్థులు ఇంటినుంచి బాక్సులు తీసుకురాకుండా, విధిగా స్కూల్లోనే పథకం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హింసను వ్యతిరేకించాలి

బొల్లాపల్లి : డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జెండర్ క్యాంపెయిన్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి గ్రామంలోని ప్రధాన కూడళ్లలో మానవహారంగా ఏర్పడి మహిళలను సమాన గౌరవంగా చూడాలి, గృహహింసలను వ్యతిరేకించాలి, మహిళలపై దాడులను అరికట్టాలి, సాంఘికదురాచారాలను నిర్మూలించాలని నినాదాలు చేశారు. అనంతరం సీసీ దాసు మాట్లాడుతూ మహిళలకు సమాజంలో సమాన గౌరవంతో పాటు గుర్తింపు ఇవ్వాలని తెలిపారు. మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను, వేధింపులను వ్యతిరేకించాలని అన్నారు. కార్యక్రమంలో సీసీలు, వీవోలు, డ్వాక్రా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

చిలకలూరిపేట: విద్యార్థులు ఆరోగ్య విషయాలపట్ల జాగ్రత్తలు పాటించాలని ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ చెప్పారు. మండలంలోని మురికిపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా సరైన చికిత్స అందించవచ్చని వెల్లడించారు. ఈ సందర్భంగా 600 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కరణం విజయలక్ష్మి, డాక్టర్ శారదాంబ, డాక్టర్ వైమధులత, డాక్టర్ బొంతా శ్వేత, డాక్టర్ కందిమళ్ల వాసుదేవ అంకమ్మచౌదరి పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం తరలిస్తున్న మహిళ అరెస్ట్

వినుకొండ(నూజెండ్ల): పల్నాడు జిల్లా ఎస్ఈబీ డిస్టిక్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆఫీసర్ (డీఎస్ఈవో) ఆదేశాల మేరకు వినుకొండ ఎస్ఈబీ సిబ్బంది మద్యం తరలిస్తున్న మహిళను అరెస్ట్ చేశారు. పట్టణంలోని హనుమాన్‌నగర్ 6వ వీధిలో ద్విచక్రవాహనంపై మద్యం తరలిస్తున్న దాసరి రేణుకను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద ఉన్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన 34మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. మహిళపై కేసు నమోదు చేసి వినుకొండ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించారు. ఈ దాడిలో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్. విజయభాస్కర రావు, సబ్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక చైతన్యంతోనే సమాజంలో మార్పు

చిలకలూరిపేట: సామాజిక చైతన్యంతోనే మహిళలపై జరుగుతు న్న అఘాయిత్యాలను అరికట్టవచ్చని రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరి పేట అధ్యక్షుడు కాపు వెంకటరావు చెప్పారు. క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని పోతవరం గ్రామంలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో మహిళలపై హింస అనే కార్యక్రమంపై విద్యార్థులకు శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను హింసించటం మానవ హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని చెప్పారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ తోటకూర వెంకట నారాయణ మాట్లాడుతూ భారతీయ సమాజంలో స్త్రీ పురుషుల మధ్య అసమానతలపై రాజా రామ్మోహన్‌రాయ్, జ్యోతిరావుపూలే, రామ స్వామినాయకర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పోరాడారని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఆళ్ల వేమనరెడ్డి, విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కులజనగణన సమగ్ర సర్వే పారదర్శకంగా చేయండి

నరసరావుపేట: రాష్ట్రంలో నిర్వహించే కుల జనగణన సమగ్ర సర్వే పూర్తిస్థాయిలో పారదర్శకంగా చేపట్టాలని బీసీ సంక్షేమసంఘ జిల్లా అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. జనగణన నిర్వహించే తేదీలను ప్రభుత్వం సెలవు దినాలుగా ప్రకటించాలని, సర్వే సమయంలో ప్రజలను ఎవరి నివాస ప్రాంతాల్లో వారు ఉండేలా అవగాహన కల్పించాలని కోరారు. కులాలపై అవగాహన ఉన్న అధికారులు, ప్రభుత్వ ఉపాధ్యాయులకు మాత్రమే బాధ్యతలు అప్పజెప్పాలని కోరారు. వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో పిలవబడుతున్న కులాలపై అవగాహన ఉన్న వాలంటీర్లను మాత్రమే నియమించాలన్నారు. పార్టీలు, కుల మతాలు, అతీతంగా నిర్వహించాలని,, సమగ్ర సర్వే జరిపే తేదీలో అందుబాటులో లేనిప్రజలకు మరల నమోదు చేసుకోవడానికి నెల రోజుల సమయం ఇవ్వాలన్నారు. బీసీ నాయకులు వేమవరపు శ్రీనివాసరావు ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్.కె వలి పాల్గొన్నారు.

విజయవాడ మహాధర్నా జయప్రదం చేయండి

నరసరావుపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 27 ,28 తేదీల్లో విజయవాడ జింఖానా మైదానంలో నిర్వహించే మహాధర్నా జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు వై.రాధాకృష్ణ, కామినేని రామారావు పిలుపు ఇచ్చారు. దీనికి కేంద్ర కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు తమ పూర్తి మద్దతు ప్రకటించాయన్నారు.

అన్నివర్గాలకు సంక్షేమం దరిచేరింది

- కుల, మత, పార్టీలకతీతంగా పథకాలను అందిస్తున్న ఘనత జగనన్నదే
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- నూజెండ్ల మండలం టి.అన్నవరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

వినుకొండ(నూజెండ్ల): నవరత్నాల ద్వారా అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీ, ప్రాంతాలకు అతీతంగా అందిస్తున్నారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. నూజెండ్ల మండలంలోని టి. అన్నవరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేశారు. అనంతరం ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ప్రాంతాలకు, పార్టీలకు, కులమతాలకు అతీతంగా దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత తమదే అన్నారు. నూజెండ్ల మండలాన్ని కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. నాడు-నేడు పథకం కింద ఆయా గ్రామాల్లో పాఠశాలలను అభివృద్ధి చేశామన్నారు. గ్రామసచివాలయం, రైతు భరోసా కేంద్రంతో పాటు జేజేఎం పథకం కింద ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధిలో కూడా ఎక్కడా రాజీ లేకుండా చూస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. రైతు భరోసా, అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలతో పాటు పేదలను ఆదుకునేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామ సచివాలయాలకు నిధులు కేటాయించి స్థానికంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ సచివాలయాల ద్వారా ఇంటింటికి సేవలు అందిస్తున్న ఘనత తమదే అన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు నక్కా నాగిరెడ్డి, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, వైస్ చైర్మన్ కొమిరిశెట్టి రామారావు, వెంకటేశ్వరరెడ్డి, తలారి ఆంజనేయులు, జెడ్పీకోఆప్షన్ గుండాల స్వెనోమ్, ఒంగూరి ప్రసాద్, గాదె నాగార్జున రెడ్డిలతో పాటు మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండ్రముట్లలో పోలీసుల పల్లెనిద్ర



పల్లెనిద్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ సుధాకరరావు

ఈపూరు: పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా కొండ్రముట్ల గ్రామంలో ఈపూరు ఎస్ఐ మహమ్మద్ ఫిరోజ్ ఆధ్వర్యంలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వినుకొండ రూరల్ సీఐ సుధాకరరావు పాల్గొని గ్రామప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు రాబోవు ఎలక్షన్స్‌లో గొడవలకు దూరంగా ఉండాలని, చట్టాల గురించి, పోలీసులకు సమాచారం, సహకారం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరంలో..

నాదెండ్ల: మత్తు పదార్థాలు, జూదం, అనైతిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, గ్రామంలో శాంతియుత వాతావరణాన్ని చెడగొట్టేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని ఎస్సై జె.బలరామ్‌రెడ్డి చెప్పారు. గణపవరం రాజీవ్‌గాంధీకాలనీలో శుక్రవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో పల్లెనిద్ర చేశారు. ముందుగా సిబ్బందితో కాలనీలోని పలు వీధుల్లో పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సభలో మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకునే ప్రక్రియలో భాగంగా పల్లె నిద్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవనం చేయాలని, కలిసి మెలిసి ఉండాలన్నారు. ఇబ్బందులు తలెత్తినపుడు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు ప్రమాదాలు, సెల్‌ఫోన్ వినియోగం, సైబర్ నేరాలు, క్రికెట్ బెట్టింగ్ వంటి వాటి పట్ల ప్రజలు అవగాహన కలిగిఉండాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు కాట్రు రమేష్, వలంటీర్లు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎడ్వర్డ్‌పేటలో..

రొంపిచర్ల: గ్రామాల్లో విద్యను అభ్యసించిన వారు ఎక్కువగా ఉంటే ఆ గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చేందుతుందని రూరల్ సీఐ కృష్ణయ్య అన్నారు. మండలంలోని ఎడ్వర్డ్‌పేట గ్రామంలో జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి నిర్వహించిన పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో ఎలాంటి శాంతి భద్రతల సమస్యలున్నా పోలీసుల వారి దృష్టికి తీసుకురావాలన్నారు. తల్లిదండ్రులు క్రమశిక్షణతో తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కేపీ రవీంద్ర, గ్రామ సర్పంచ్ జిడ్డు ఎర్రయ్య, మాజీ సర్పంచ్ కోడూరి వెంకటేశ్వరరెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టాభిరాముడి సన్నిధిలో కార్తిక పూజలు



నరసరావుపేట ఈస్ట్: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకొని పట్టాభిరామ స్వామి వారి దేవాలయంలో శనివారం హరేరామ హరేకృష్ణ నామ మహోత్సవం, శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నాగసరపు సుబ్బరాయ గుప్తా, అనురాధ దంపతులు, వారి కుమారులు రూపేష్ గుప్తా, రామ్‌దేవ్ గుప్తా దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేసి కళ్యాణం జరిపారు. మధ్యాహ్నం అన్న ప్రసాదం పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.